సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



మౌలిక సదుపాయాల కల్పనలో..
మౌలిక సదుపాయాల కల్పన, పనుల నాణ్యతలో రాజీపడొద్దని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు.
- 11లో ▸



చిన్న నిర్లక్ష్యం.. భారీ మూల్యం
రోడ్లపై వరి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంట దిగుబడులను ఆరబోస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.1 /19.2
వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఎండ ప్రభావం ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైన్ షాపులకు 1400కు పైగా దరఖాస్తులు

- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ
- గణనీయంగా తగ్గిన పోటీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మద్యం దుకాణాలకు దరఖాస్తుల దాఖలు గడువు శనివారం సాయంత్రంతో ముగిసింది. జిల్లాలోని 49 వైన్ షాపులకు 1400కు పైగా దరఖాస్తులు వచ్చాయి. శనివారం అర్ధరాత్రి వరకు సంబంధిత అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. రెండేళ్ల కిందట 49 దుకాణాలకు 2,204 దరఖాస్తులు రాగా.. ఈ సారి తగ్గాయి. గతంలో దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు ఉండగా, ఈ సారి రూ.3 లక్షలకు పెంచారు. దీంతో దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గిందని భావిస్తున్నారు. సర్కిళ్ల వారీగా కౌంటర్లను ఏర్పాటు చేసిన అధికారులు దరఖాస్తులను స్వీకరించారు.

ఇస్రో సందర్శనకు జిల్లా విద్యార్థులు



శైలజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు



రవిత్రేణి



నిఖిల

బాన్సువాడ రూరల్/కామారెడ్డి రూరల్: భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సందర్శన కోసం జిల్లాలో పదో తరగతి అభ్యసిస్తున్న ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. బాన్సువాడ మండలం కోనాపూర్ జెడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థిని జి శైలజ, కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నిఖిల, రవిత్రేణి ఎంపికైనట్లు హెచ్‌ఎంలు శంకర్, సాయిరెడ్డి తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు త్వరలోనే ఇస్రో సందర్శనకు వెళ్తారన్నారు. శైలజను ఉపాధ్యాయులు, గ్రామస్తులు శనివారం అభినందించారు. ఉపాధ్యాయులు అంజయ్య, నబీ, రమేశ్, ప్రేమ్‌సింగ్, నర్సింగ్ రావు, స్నేహలత, సుజాత, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చిన్నమల్లారెడ్డి పాఠశాల హెచ్‌ఎం సాయిరెడ్డి మాట్లాడుతూ.. భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు, గైడ్ టీచర్ ప్రవీణ్‌కుమార్ మార్గదర్శకత్వంలో తమ పాఠశాల విద్యార్థులు ఇస్రో సందర్శనకు ఎంపికయ్యారని అభినందించారు.

22న జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 22వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి ఎం రజనీకిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్‌లో ఉద్యోగాల భర్తీ కోసం బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టరేట్‌లోని 121 నంబర్ గదిలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన వారు నిజామాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని, వివరాలకు 98854 53222, 76719 74009 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతలను అభినందిస్తున్న డీఆర్వో

కామారెడ్డి క్రైం: రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుమోహన్ అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరం ఉన్నవారికి రక్తం అందించడానికి జిల్లాలో విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన వారిని అభినందించారు. శిబిరంలో భాగంగా మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది, మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల ప్రతినిధులు మొత్తం 40 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీపతి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, వైస్ చైర్మన్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గంజికీ తిప్పలు!

ఖద్దర్ అంగికి ఖదర్ ఎక్కువ.. ఈ మాట తరచూ వింటుంటాం. రాజకీయాలపై ఆసక్తితో తమ నాయకుడి వెనకాల తిరిగే వారితోపాటు గ్రామస్థాయిలో వార్డు సభ్యుడు, సర్పంచ్, ఎంపీటీసీ ఇలా ప్రజాప్రతినిధులమని గొప్పగా చెప్పుకునే వారికి 'మెయింటెనెన్స్' తలకు మించిన భారమవుతోంది. ఇంట్లో నుంచి అడుగు బయటికి వెళ్లాలంటే ఖద్దరు చొక్కా వేయాల్సిందే. ఆ ఖరీదైన ఖద్దరు చొక్కాను కాపాడుకునేందుకు చోటామోటా నాయకులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఖద్దరు చొక్కా వెనుక కనపించని వ్యథపై 'సాక్షి' సండే స్పెషల్..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- మరకలు అంటకుండా.. ఇస్త్రీ నలగకుండా జాగ్రత్తలు
- ఒక్క అంగీ నాలుగైదు రోజులు తొడగాల్సిందే
- చోటామోటా లీడర్ల ఖద్దరు బట్టల వెనుక కన్నీటి వేదన



సండే స్పెషల్

గంజీ వేస్తేనే ఖద్దరు అంగికి ఖదర్ ఎక్కువ. ఖద్దరు బట్టలు తొడిగితేనే లీడర్‌కు గుర్తింపు. జేబులో రూపాయి ఉన్నా లేకున్నా మెయింటెనెన్స్ చేయాల్సిందే. అంగికి గంజీ వేసి, ఇస్త్రీ చేయాలంటే కనీసం రూ.100 నుంచి రూ.150 అవుతుంది. అందుకే చోటామోటా లీడర్లు ఖద్దరు బట్టలను జాగ్రత్తగా చూసుకుంటారనే కన్నా కాపాడుకుంటారని అనాలి. కొందరైతే ఖద్దరు అంగీ చిరిగి పోయినా సరే కుట్లేయించుకుని మరీ వాడుకుంటారు. చాలా మంది గంజీ వేసి, ఇస్త్రీ చేసిన అంగినీ కనీసం నాలుగు రోజులైనా ధరించాల్సిందే. లేదంటూ వాటిని మెయింటేన్ చేయడానికి రూ.వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుకే ఖద్దరు బట్టలు వేసుకున్నపుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో వారిని చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. రాజకీయాలు ఖరీదైపోయాయి. గ్రామ, మండల స్థాయిలో అయితే లీడర్‌గా మనగలగాలంటే నలుగురు అనుచరులను మెయింటేన్ చేయాలి. ఉన్నంతలో చిన్నదో పెద్దదో కారు ఉండాలి. ఎవరో ఒకరి పని కోసం గ్రామం నుంచి మండల కేంద్రానికో, నియోజకవర్గ కేంద్రానికో వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. కారులో సరిపడా ఇంధనం ఉండాలి. గ్రామ స్థాయి నాయకుడు కనీసం నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. కొందరైతే రూ.50 వేల దాకా ఖర్చు చేస్తుంటారు. డబ్బు ఉన్నవాడు ఎలాగోలా నెట్టుకొస్తాడు. కానీ పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన లీడర్లు పడే అవస్థలు అంతా ఇంతా కాదు.

ఫంక్షన్‌కు వెళ్లి తినకుండానే..

రాజకీయాల్లో ఉన్నపుడు ఎవరు పిలిచినా ఫంక్షన్లు, పెళ్లిళ్లకు వెళ్లాల్సిందే. ఒక్కడే వెళ్తే బాగోదు కాబట్టి వెంట నలుగురిని వేసుకుని వెళ్లాలి. కొందరు లీడర్లు ఇంటి నుంచి బయటకు వెళ్లేటపుడు సాధారణ బట్టలు ధరిస్తారు. ఫంక్షన్‌కు చేరే ముందు ఎక్కడో ఒక చోట ఆగి ఖద్దరు అంగీలు తొడుక్కుని వెళుతుంటారు. ఖద్దరు బట్టలు ధరించకుంటే లీడర్‌గా గుర్తించరనే భావన చాలా మందిలో ఉంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఖద్దరు అంగీ తొడుక్కుంటారు. ఫంక్షన్‌కు వెళ్లిన వారిలో చాలా మంది ఈ మధ్య కాలంలో భోజనం చేయడం లేదు. వేరే ఫంక్షన్‌లో తిన్నామనో, వేరే దగ్గరికి వెళ్లాల్సి ఉందనో చెప్పి బయటపడుతున్నారు. తినకపోవడం వెనుక పెద్ద కారణమే ఉందని పలువురి మాటల్లో తెలుస్తోంది. ఫంక్షన్‌లో తినే సమయంలో షర్ట్ నలిగిపోతుంది. చెమటతో గంజీ (స్టార్చ్) పవర్ పోతుంది. అంతేగాక ఏదైనా ఆహార పదార్థం పడితే బట్టలకు మరకలవుతాయి. రూ.వేలు ఖర్చు చేసి కుట్టించుకుని, దాన్ని మెయింటెనెన్స్ కోసం రూ.వందలు ఖర్చు చేసి అనవసరంగా మరకలు అంటించుకుంటే, అవి పోయే పరిస్థితి ఉండదనే ఉద్దేశంతో చాలా మంది తినడం లేదని తెలుస్తోంది. కొందరు తప్పనిసరి తినాల్సి ఉంటే జాగ్రత్తగా తిని బయటపడుతున్నారు. కొన్ని చోట్ల మందు దావత్ ఉంటే కూడా త్యాగం చేస్తున్నారు. బట్టలు దెబ్బతింటే ఇబ్బంది అవుతుందని జాగ్రత్త పడుతున్నారు.

కదిలిస్తే కన్నీళ్లే..

చాలా మంది చోటా, మోటా లీడర్లను కదిలిస్తే చాలు కన్నీళ్లు పెట్టుకుంటారు. ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి తమదంటూ ఆవేదన వ్యక్తం చేస్తారు. ఓ మారుమూల గ్రామంలో సర్పంచ్‌గా పనిచేసిన యువకుడొకరు ఊరి అభివృద్ధి కోసం ఎంతో శ్రమించాడు. ఉత్తమ పంచాయతీగా గుర్తింపు తీసుకువచ్చాడు. కానీ తాను చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయాడు. బిల్లులు రాక, అప్పులు తీర్చే మార్గం కానరాక తల్లిదండ్రులు సంపాదించి ఇచ్చిన రెండెకరాల భూమిని అమ్ముకుని అప్పులు కట్టాడు. మూడేళ్లు గడచినా మూడు రూపాయలు రాలేదని సదరు మాజీ సర్పంచ్ 'సాక్షి'తో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యాడు. ఇలా ఎవరిని కదిలించినా కన్నీళ్లు రాలుతున్నాయి. ఖద్దరు వేసుకున్నోళ్లంతా ఉన్నోళ్లు కాదని, ఖద్దరు వెనుక కన్నీటి వేదన ఎంతో ఉందని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

పైన పటారం.. లోన లొటారం

రాజకీయాల్లో చాలా మంది ఆటుపోట్లను ఎదుర్కొంటున్నారు. కొందరు దాబు ప్రదర్శించేందుకు స్థాయికి మించి ఖర్చులు చేసి అప్పులపాలవుతున్నారు. సులువుగా డబ్బులు సంపాదించొచ్చు అన్న భావనతో చాలా మంది రాజకీయాల్లోకి వచ్చి నిండా మునిగారు. గ్రామాల్లో సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, ఎంపీపీలు, జెడ్పీటీసీలుగా పనిచేసిన ఎంతో మంది అప్పులపాలయ్యారు. ఎన్నికలు అంటేనే ఖర్చుతో కూడుకున్నవి కావడంతో చాలా మంది అప్పులు చేసి పోటీ చేయడం, తరువాత సంపాదన ఏమో గానీ, మెయింటెనెన్స్ చేసేందుకు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. ఖర్చుల మందమైనా సంపాదించాలన్న ఆశతో కొందరు కాంట్రాక్టు పనులు చేసి బిల్లులు రాక చిత్తయ్యారు. ముఖ్యంగా మొన్నటి వరకు సర్పంచులుగా పనిచేసిన వారిలో వందలాది మంది అప్పుల్లో కూరుకుపోయారు. కొందరైతే అప్పులు తీర్చేందుకు ఆస్తులు కూడా అమ్ముకున్నారు. పెద్ద పంచాయతీలు, నిర్మాణాలు ఎక్కువగా జరిగే చోట అంతో ఇంతో ఖర్చులకు సంపాదించారు గానీ, చాలా గ్రామాల్లో సర్పంచులు అప్పులపాలయ్యారు. ఇప్పటికీ కోలుకోవడం లేదు. పైన పటారం.. లోన లొటారం అన్నట్టుగా ఉంది పరిస్థితి.



కామారెడ్డి బస్టాండ్ ముందు బైఠాయించిన బీసీ జేఏసీ నాయకులు

బీసీ బంద్ సక్సెస్

కదలని ఆర్టీసీ బస్సు చక్రాలు

- బంద్‌లో పాల్గొన్న వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు
- నిర్మానుష్యంగా మారిన రోడ్లు
- 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు కోసం జేఏసీ డిమాండ్



కామారెడ్డి డిపోలో నిలిచిన బస్సులు

కామారెడ్డి టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన తెలంగాణ బంద్ శనివారం జిల్లాలో సక్సెస్ అయ్యింది. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట శనివారం తెల్లవారుజామున జేఏసీ నాయకులు బైఠాయించి బస్సులు బయటికి రాకుండా ధర్నా చేశారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ, నిజాంసాగర్ చౌరస్తాలో మానవహారం చేపట్టి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ బంద్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్, వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు పాల్గొన్నాయి. బంద్‌తో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే సుభాష్, జేపీఎన్, మాయా, సిరిసిల్లా, స్టేషన్ రోడ్లు, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ ఏరియాలో బోసిపోయాయి. బస్సులు డిపో, బస్టాండ్‌లకు పరిమితమయ్యాయి. బంద్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ నాయకులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ నాయకులతోపాటు ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర నాయకత్వానికి నివేదిక అందిస్తాం



దరఖాస్తు చేసుకున్న నాయకులతో కలిసి మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ రాజ్‌పాల్ కరోల

- డీసీసీ అధ్యక్ష పదవి కోసం 30 దరఖాస్తులు
- ఏఐసీసీ పరిశీలకుడు రాజ్‌పాల్ కరోల

కామారెడ్డి టౌన్: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం 30 దరఖాస్తులు అందాయని, ప్రతి ఒక్కరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర నాయకత్వానికి నివేదిక అందిస్తామని ఏఐసీసీ పరిశీలకుడు రాజ్‌పాల్ కరోల అన్నారు. డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న 30 మంది నాయకులతో శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రాజ్‌పాల్ సమావేశమయ్యారు. ఒక్కొక్కరితో ప్రత్యేకంగా సుదీర్ఘంగా చర్చించి అభిప్రాయాలు సేకరించామని, వారి అభిప్రాయాలు, సలహాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని ఆయన తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ..

డీసీసీ పదవికి నాయకుల నుంచి పోటీ బాగానే ఉంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల నుంచి నాయకులు డీసీసీ పదవిని ఆశిస్తున్నారు. ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించిన కరోల నాలుగు నియోజకవర్గాల్లో నాయకుల అభిప్రాయాలను సేకరించారు. జిల్లా అధ్యక్ష పదవి ఎవరిని వరించెనో అని ఉత్కంఠ నెలకొంది.

అధికారిక లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు

- నివాళులు అర్పించిన ఐజీ, సీపీ
- నిందితుడి కోసం ఎనిమిది పోలీసు బృందాల గాలింపు

నిజామాబాద్‌అర్బన్: సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో నిందితుడు రియాజ్‌ను పట్టుకునేందుకు ఎనిమిది పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. శుక్రవారం బాబన్‌సాబ్ పహాడ్ వద్ద కెనల్ కట్ట ప్రాంతంలో రియాజ్‌ను పట్టుకునేందుకు కానిస్టేబుల్ ప్రయత్నం చేశాడు. కెనాల్ కాల్వ గుండా పారిపోతున్న రియాజ్‌ను వెంబడించి పట్టుకున్నాడు. అనంతరం తన బైక్‌పై సీసీఎస్ ఎస్సై విఠల్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి బైక్‌పై తీసుకువస్తున్నారు. ఈ సందర్భంలోనే రియాజ్ కానిస్టేబుల్‌ను పొడిచి హత్య చేశారు. నిందితుడు రియాజ్ సెల్‌ఫోన్ వదిలేసి మరో బైక్‌ను దొంగిలించి పారిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు.

అతడి ఆచూకీ కోసం ఎనిమిది బృందాలు గాలిస్తున్నాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు నగరంలోనే ఉన్నట్లు పోలీసులకు సమాచారం. కొన్ని బృందాలు పట్టణంలో గాలింపు చర్యలు చేపడుతున్నాయి. మరికొన్ని బృందాలు రియాజ్ తరచుగా వెళ్లే ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయి. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని సీపీ సాయి చైతన్య అన్నారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి.. పాడె మోస్తున్న సీపీ సాయిచైతన్య

అంత్యక్రియలో పాల్గొన్న ఐజీ, సీపీ

కానిస్టేబుల్ ప్రమోద్ అంత్యక్రియలు నగరంలో శనివారం అధికారిక లాంఛనాలతో పూర్తయ్యాయి. స్థానిక రైల్వే కమాన్ ప్రాంతంలోని బ్యాంకు కాలనీలోని ఆయన నివాసం నుంచి శవ యాత్ర ప్రారంభమైంది. ఈ అంత్యక్రియలకు మల్టీజోన్- 1 నార్త్ తెలంగాణ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ సాయి చైతన్య, పోలీస్ అధికారులు హాజరయ్యారు. ప్రమోద్ కుటుంబానికి అండగా ఉంటామని సీపీ పేర్కొన్నారు. ప్రమోద్ పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. శవ యాత్రలో పాడె మోశారు. ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నిందితుడు రియాజున్ త్వరలోనే పట్టుకుంటామన్నారు. శాంతి భద్రతల విషయంలో ఉపేక్షించబోమన్నారు.

సోయా.. కొనే సోయి లేదా?

- పంట చేతికొచ్చి పదిహేను రోజులు..
- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- రోడ్లపై పంట దిగుబడి రాశులు
- పండగ పూట చేతిలో చిల్లిగవ్వ లేక రైతుల సతమతం
- తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయం



మద్నూర్ మార్కెట్‌లో ఆరబోసిన సోయా

మద్నూర్(జుక్కల్): చేతికొచ్చిన సోయాను ఆరబోస్తూ రాశులు చేస్తున్న రైతులు కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ప్రారంభమవుతాయా? అని ఎదురు చూస్తున్నారు. పండగ పూట చేతిలో చిల్లిగవ్వలేక సతమతమవుతున్నారు. గత పదిహేను రోజులుగా సోయా కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారు. జిల్లాలో సోయాబీన్ 80 వేల ఎకరాల్లో సాగు కాగా, అందులో 35 వేల ఎకరాల సాగు విస్తీర్ణం మద్నూర్, డోంగ్లీ మండలాల పరిధిలో ఉంది. మద్నూర్, డోంగ్లీ, బిచ్కుంద, జుక్కల్ మండలాల్లో ఎక్కువ శాతం రైతులు సోయా పంట పండించారని వ్యవసాయ అధికారులు చెప్పారు. ఈ సారి పంట కోతల సమయంలో భారీ వర్షాలు కురవడంతో సోయా దెబ్బతిన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా, ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్లకు పడిపోయిందని, ఖర్చులు బాగా పెరిగాయని రైతులు అంటున్నారు. కేవలం కల్లానికి ఎకరాకు రూ.5 వేల వరకు ఖర్చు అవుతుందని అంటున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆగమవుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5320 కాగా, బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు కేవలం రూ.3,800 నుంచి రూ.4,200 చెల్లిస్తున్నారు. అంతే కాకుండా హడత్, హమాలీ పేరుతో రూ.వెయ్యి వరకు కట్ చేస్తున్నారు. ఈ ఏడాది డోంగ్లీలో సైతం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు. మద్నూర్ వరకు తీసుకువెళ్లాలంటే రవాణా ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయని అంటున్నారు.

కొనుగోళ్లకు చర్యలు

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం సోయా కొనుగోళ్లు చేపట్టి రైతులకు మద్దతు ధర అందేలా తగు చర్యలు తీసుకుంటున్నామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలిపారు. సోయా కొనుగోళ్ల అంశంపై మార్కెఫెడ్ చైర్మన్ గంగారెడ్డితో శనివారం ఫోన్‌లో మాట్లాడినట్లు ఎమ్మెల్యే సాక్షికి తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో సోయా పంట ఆశాజనకంగా ఉందని, పంట కొనుగోళ్లను సత్వరమే ప్రారంభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారం రోజుల్లో సోయా కొనుగోళ్ల ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని, ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించొద్దని రైతులకు ఎమ్మెల్యే సూచించారు.

బయటి మార్కెట్‌లో అమ్ముకున్న



కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో రూ.4వేలకు చొప్పున 6 క్వింటాళ్ల సోయాను అమ్మేశా. పండగపూట చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం, అప్పుల వాళ్లు డబ్బులు కట్టాలనడంతో మరోదారి లేక అమ్మేశా. – శివన్న, రైతు, మద్నూర్

'సాక్షి'పై కూటమి కుట్రలు

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా?

- దాడులు, అక్రమ కేసులు బనాయించడం దారుణం
- కక్ష సాధింపు చర్యలను మానుకోవాలి
- పత్రికాస్వేచ్ఛను కాపాడాలి

కామారెడ్డి టౌన్: ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ నిరంతరం అక్షర యజ్ఞం చేస్తున్న 'సాక్షి'పై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు చేస్తోందని ప్రజా, ఉపాధ్యాయ, జర్నలిస్టు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. హైదరాబాద్‌లోని సాక్షి దినపత్రిక ప్రధాన కార్యాలయంపై దాడులు అలాగే ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు వంటిచర్యలను మానుకోవాలని అన్ని వర్గాలు ముక్తకంఠంతో నినదిస్తున్నాయి.

రాజకీయ కక్షలతోనే దాడులు



సాక్షి మీడియాపై రాజకీయ కక్షతోనే దాడులు చేయడం సరికాదు. వాస్తవాలను రాస్తున్న మీడియాపై అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా భావిస్తున్నాం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కుట్రలు మానుకోవాలి. – సీహెచ్ అనిల్ కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే..



పత్రికా స్వేచ్ఛను హరించే చర్యలు రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే. ఆంధ్రప్రదేశ్‌లో సాక్షిపై కక్ష సాధింపులు మానుకుని చట్ట ప్రకారం ముందుకెళ్లాలి. ప్రజా సమస్యలను కథనాల రూపంలో రాస్తున్న సాక్షిపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు. – కొంగల వెంకటి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మీడియా జోలికొస్తే ఊరుకునేది లేదు



మీడియా జోలికి వస్తే ఊరుకునేది లేదు. ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం. రాజకీయంగా ఏదైనా ఉంటే కోర్టులు, చట్టాలు ఉన్నాయి. న్యాయపరంగా పోరాడాలి. సాక్షిపై దాడులు చేయడం, ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం సరికాదు. – ముదాం శంకర్, టీయూడబ్ల్యూజే, జిల్లా ఉపాధ్యక్షుడు

సాక్షి మీడియాపై దాడి హేయం



ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం సాక్షి మీడియాపై దాడి చేయడం హేయమైన చర్య. ఇది ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వమే ఇలా చేయడం దారుణం. ఏపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. సాక్షిపై కక్ష సాధింపులను మానుకోవాలి. – ఎల్ దశరథ్, సీపీఐ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం 5,654 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 4 వేలు, సరస్వతి కాలువ ద్వారా 650, లక్ష్మి కాలువ ద్వారా 200, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 573 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి అంతే స్థాయి నీటిమట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉందని అధికారులు తెలిపారు.

వైద్య కళాశాలకు నాలుగు పీజీ సీట్లు పెంపు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలకు పీడియాట్రిక్ విభాగంలో నాలుగు పీజీ సీట్లు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఇది వరకే మూడు పీజీ సీట్లు వచ్చాయని, తాజాగా నాలుగు పెంచడంతో ఏడు సీట్లకు పెరిగినట్లు వివరించారు. డెర్మటాలజీ విభాగంలో నాలుగు పీజీ సీట్లు నూతనంగా అందుబాటులోకి వచ్చాయన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు జలగం తిరుపతి రావు, డాక్టర్ నాగమోహన్, డాక్టర్ కిశోర్, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ, ఆఫీస్ సూపరింటెండెంట్ నాగరాజు సిబ్బంది, సహకారంతోనే సాధ్యమైందని తెలిపారు.

బోధన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 422 దరఖాస్తులు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని 18 మద్యం దుకాణాలకు శనివారం రాత్రి 10 గంటల వరకు 422 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ భాస్కర్‌రావ్ తెలిపారు. ఈ నెల 23న లక్కీడ్రా నిర్వహిస్తామని, డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయని సీఐ వెల్లడించారు.

తొమ్మిది ట్రాక్టర్లు సీజ్

రాజంపేట: మండలంలోని పెద్దాయిపల్లి గ్రామ శివారులోని గుట్ట నుంచి మొరం అక్రమ రవాణా చేస్తున్న పలువురిపై కేసు నమోదు చేసి తొమ్మిది ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై రాజు శనివారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక, మొరం రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంటాలు, గన్నీ బ్యాగులు లేవు

- గాంధారి మండలంలో అధికారికంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- మొదలైన వరికోతలు
- పచ్చి ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్లు వ్యాపారులకు విక్రయిస్తున్న రైతులు



నూర్పిడీ చేసిన ధాన్యాన్ని ట్రాక్టర్లో వేస్తూ..



గాంధారి శివారులో వరి కోస్తున్న హార్వెస్టర్

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గ్రామాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభం కాలేదు. గత 15 రోజుల క్రితమే కలెక్టర్ ఆదేశాలతో అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ప్రారంభించారు. కేంద్రాల్లో ఇప్పటికి వరకు కాంటాలు, గన్నీ బ్యాగులు అందుబాటులో లేవు.మండలంలో 21,200 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. మండల పరిధిలో మొత్తం 37 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానుండగా, అందులో 25 ఐకేపీ ఆధ్వర్యంలో, 12 కేంద్రాలు గాంధారి, ముదెల్లి సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అధికారులు ముందు జాగ్రత్తగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా అందుకు తగిన ఏర్పాట్లు ఇప్పటికీ చేయలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,389 ఉండగా, రైస్ మిల్లు వ్యాపారులు పచ్చి ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ. 1800–1850 కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. అధికారులు తొందరగా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

పచ్చి ధాన్యాన్ని విక్రయించాను



వాతావరణ పరిస్థితులకు భయపడి పచ్చి వడ్లను రైస్ మిల్లు వ్యాపారికి విక్రయించాను. అధికారులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటికీ కేంద్రంలో కాంటాలు, గన్నీ బ్యాగులు లేవు. ధాన్యం ఆరబోసినా తేమ శాతం వచ్చిన తరువాత వర్షం పడితే మళ్లీ తడిసి పోయి నష్టం జరిగే అవకాశం ఉంది. అందుకే కొంత మేర నష్టం జరిగినా ఇబ్బంది ఉండదనే ఉద్దేశంతో పచ్చి ధాన్యం విక్రయించాను.

– నాగ్లూర్ గంగాధర్ రైతు, గాంధారి

తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దు

అధికారుల ఆదేశాల మేరకు గత 15 రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాము. వరి కోతలు ఇప్పుడే ప్రారంభం అయ్యాయి. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెట్టే వరకు కేంద్రాల్లో కాంటాలు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంటాయి. రైతులు తొందర పడి పచ్చి ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దు.

– ఏవో రాజలింగం, గాంధారి

182 సార్లు కాశీ యాత్ర...2 సార్లు చార్‌ధామ్ యాత్ర

- 2002 నుంచి పర్యటిస్తున్న కామారెడ్డి వాసి



కాశీలో సన్యాసులతో నీలం వెంకటి (ఫైల్)



చార్‌ధామ్ యాత్రలో..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లికి చెందిన నీలం వెంకటి ఇప్పటికి 182 సార్లు కాశీలో విశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. కాశీలో ఒక్కోసారి వారం రోజుల పాటు ఉండి గంగస్నానం చేశారు. దేవునిపల్లి శివాలయంలో 2002లో శివదీక్షలు ప్రారంభించినపుడు అర్చకులు మశ్చేందర్‌ప్రసాద్ దేశ్‌పాండేతో కలిసి దీక్ష పరులందరితో కలిసి కాశీ వెళ్లినట్టు వెంకటి వివరించారు. అర్చకులు మశ్చేందర్‌ప్రసాద్ ఇప్పటికి 108 సార్లు కాశీకి భక్తులను తీసుకుపోయి గంగాతీరంలో పశుపత రుద్ర యాగాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం శివమాల ధరించడం, డ్రైవింగ్ బాగా రావడం, కామారెడ్డి నుంచి కాశీ, అయోధ్య వరకు అన్ని దగ్గరి దారులు తెలియడంతో పాటు కాశీలో పలువురితో పరిచయాలు ఉండడంతో కాశీలో తక్కువ వ్యయంతో బస చేయడానికి ఇబ్బందులు పడకుండా ఇక్కడి భక్త బృందాలు వెంకటిని వెంట తీసుకుపోతున్నారు. అలాగే 13 శక్తి పీఠాలు దర్శించడంతో పాటు తిరుమల వేంకటేశ్వరుడిని 100 సార్లు దర్శించుకున్నట్టు, అనేక సార్లు రామేశ్వరం, సోమనాథ్, రెండు సార్లు చార్‌ధామ్ యాత్ర చేశారు. తనకు శక్తి ఉన్నంత వరకు కాశీయాత్ర చేస్తూనే ఉంటానని నీలం వెంకటి వెల్లడించారు.

రైతులకు సహకరించాలి



కామారెడ్డి క్రైం: రైతులకు మద్దతు ధర వచ్చేలా వరి కోతల సమయంలో హార్వెస్టర్ల యజమానులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని నరసన్నపల్లి వద్దనున్న రవాణా శాఖ కార్యాలయంలో జిల్లాలోని హార్వెస్టర్‌ల యజమానులు, డ్రైవర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో 3.18 లక్షల ఎకరాల్లో వరిసాగు అయ్యిందని, ఈ సమయంలో రైతులకు వ్యవసాయ కూలీలు, హార్వెస్టర్ వాహనదారుల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. పంట కోతల సమయంలో అధికారుల సూచనలను పాటించాలన్నారు. డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి మధుమోహన్, ఎంవీఐ శ్రీనివాస్, ఏడీఏ ప్రసన్న, అధికారులు, సిబ్బంది, హార్వెస్టర్ల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ దీపావళి బొనాంజ

నిజామాబాద్ రూరల్: భారత సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్‌ఎన్‌ఎల్) వినియోగదారులకు దీపావళి పండగ బొనాంజాను ప్రకటించిందని జిల్లా జీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక్క రూపాయితోనే 30 రోజులపాటు అపరిమిత ఉచిత వాయిస్ కాల్స్, రోజుకు 2జీబీ డేటా 100 ఎస్‌ఎంఎస్‌లు లభిస్తాయని పేర్కొన్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు ఉచితంగా సిమ్‌కార్డు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ఫ్ కేర్ యాప్, వెబ్‌సైట్ ద్వారా రూ.100 అంతకంటే ఎక్కువ రీచార్జ్ చేసుకునే పది మందిని లక్కీ డిప్ ద్వారా ఎంచుకొని ఒక్కొక్కరికి 10 గ్రాముల సిల్వర్ కాయిన్‌ను బహుమతిగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జీఎం కోరారు.

రెవెన్యూ సిబ్బందికి డిప్యుటేషన్లు

నిజామాబాద్‌అర్బన్: రెవెన్యూ శాఖలో పలువురు ఉద్యోగులను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఇటీవల రేషన్‌కార్డుల జారీలో అనేక అక్రమాలు జరిగినట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ జిల్లా అధికారులకు నివేదించారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు ఆయా మండలాల్లో అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించారు. అయితే, వారిపై సస్పెన్షన్ వేటు వేయాల్సి ఉండగా, బదిలీలతో సరిపెట్టడం చర్చనీయాంశంగా మారింది. రెంజల్ తహసీల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గౌతంను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, బోధన్ తహసీల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సుమంత్‌ను జిల్లా కేంద్రంలోని టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు, ఇందల్వాయి ఆర్‌ఐ దండి మోహన్‌ను టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు, సిరికొండ ఆర్‌ఐ గంగరాజంను నిజామాబాద్ సౌత్ మండలానికి, ధర్పల్లి ఆర్‌ఐ రవిని ఎడపల్లికి, నిజామాబాద్ సౌత్ మండల ఆర్‌ఐ నవాజ్‌ను బోధన్ తహసీల్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపించారు.

ధ్రువపత్రాల భద్రతకు 'డిజిలాకర్'

మీ కోసం..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రయాణాలు ఇతర సందర్భాల్లో చాలా మంది ఉత్తీర్ణత, ఇతర విలువైన ధ్రువపత్రాలను మరిచిపోతున్నారు. ఒక్కోసారి పోగొట్టుకున్న పత్రాలను తిరిగి పొందడం కష్టంతో కూడుకున్న పని. ఇలాంటి పరిస్థితిని అధిగమిస్తూ ఎలాంటి ధ్రువపత్రాలనైనా భద్రంగా దాచుకునేలా కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. అదే డిజిలాకర్.

- కాగిత రహిత పాలనను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రారంభించిన ఈ డిజిలాకర్‌ను విద్యార్థులు, నిరుద్యోగులే కాకుండా ప్రతి ఒక్కరూ విలువైన పత్రాలను దాచుకునేందుకు బ్యాంక్ లాకర్‌గా పనిచేస్తోంది.
- డిజిటల్ విధానంలో దాచుకున్న పత్రాలను ఎక్కడైనా, ఏ సమయంలోనైనా అవసరమైనప్పుడు ఉపయోగించుకోవచ్చు.
- ఇవి వాస్తవ ధ్రువీకరణ పత్రాల మాదిరే చట్టపరంగానూ చెల్లుబాటు అవుతాయి.
- లాకర్ సహాయంతో పంపించే ఈ పత్రాలను వాటి క్యూఆర్ కోడ్ లేదా డిజిటల్ సంతకాలతో నిర్ధారణ జరుగుతుంది.
- డిజిలాకర్ ఖాతాకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఆధార్ కార్డు, దానితో అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- అనంతరం ఓటీపీతో లాగిన్ అయితే మన ఆధార్‌పై లాకర్ తెరుచుకుంటుంది.
- డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్, ఓటరు ఐడీ, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, జనన ధ్రువపత్రాలు, విద్యార్హత ఇలా అన్ని రకాల పత్రాలను స్కాన్ చేసుకొని భద్రపరుచుకోవచ్చు.
- ఒక్కొక్కరూ ఒక జీబీ వరకు డాటా ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది.

సాదాసీదాగా ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీవో వామన్ రావు

- ఉమ్మడి మాచారెడ్డి మండలంలో 730 పనులకు గానూ రూ.20.10కోట్ల వ్యయం

మాచారెడ్డి: ఉపాధి హామీ పనులకు సంబంధించిన ప్రజావేదిక శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అడిషనల్ డీఆర్డీవో వామన్ రావు ఆధ్వర్యంలో సాదాసీదాగా కొనసాగింది. ఉమ్మడి మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో 1 ఏప్రిల్ 2024 నుంచి 31మార్చి 2025 వరకు జరిగిన పనులకు సంబంధించి ఈ నెల 10 నుంచి 17వరకు సామాజిక తనిఖీ సిబ్బంది చేపట్టిన వివరాలను ప్రజావేదికలో వెల్లడించారు. చిన్న చిన్న సాంకేతిక లోపాలు మినహా పనులన్నీ సవ్యంగా సాగినట్లు సిబ్బంది వివరించారు. ఏడాది కాలంలో మొత్తం 730 పనులకు గానూ రూ 20.10 కోట్లు వ్యయమైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపిబాబు, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీవో ప్రశాంత్, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రజాప్రతినిధులు లేని ప్రజావేదిక..

ఎప్పుడైనా ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారు. ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో అధికారులే తమ సిబ్బందితో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

రెండేళ్లకు చిక్కాడు..

- హంతకుడు మద్నూర్‌వాసి
- సిద్దిపేటలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ, పోలీసులు, చిత్రంలో నిందితుడు బాలాజీ

తాండూరు: హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడిని రెండేళ్ల తర్వాత పోలీసులు పట్టుకున్నారు. వివరాలను డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ నగేశ్ శనివారం విలేకరులకు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మన్‌సన్‌పల్లికి చెందిన ముడావత్ రవి(39) వ్యవసాయ పనులు చేస్తూ జీవించేవాడు. గ్రామ శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో పనిచేసే కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన బాలయ్య అలియాస్ బాలాజీతో ఇతనికి స్నేహం కుదిరింది. ఈ క్రమంలో పలుమార్లు మద్యం తాగేందుకు రవి వద్ద బాలాజీ రూ.2,050 అప్పుగా తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా తిరిగి డబ్బులు ఇవ్వకపోవడంతో పలుమార్లు అడగగా, రవి తన పరువు తీస్తున్నాడని కక్షపెంచుకున్న బాలాజీ 2023 ఆగస్టు 12న మద్యం తాగుదామంటూ తాను పనిచేసే ఫామ్‌హౌస్ వద్దకు పిలిచాడు. అనంతరం పథకం ప్రకారం కత్తితో పొడిచి పారిపోయాడు. ఆస్పత్రిపాలైన బాధితుడు చికిత్స పొందుతూ ఆరు రోజుల తర్వాత మరణించాడు. దీంతో నిందితుడైన బాలాజీపై హత్య, అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. నాటి నుంచి హంతకుడి కోసం పోలీసులు వెతుకుతున్నా ఆచూకీ లభించలేదు. ఇటీవల మృతి చెందిన తన తల్లి అంత్యక్రియలకు సైతం రాలేదు. కొన్నాళ్లుగా అతని కుటుంబసభ్యుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు, కాల్‌డాటా ఆధారంగా నిందితుడు సిద్దిపేటలోని తన సోదరుడు సంజీవ్ ఇంట్లో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు. హత్య అనంతరం చాలారోజులు మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా వీసాపూర్‌లో తలదాచుకున్నాడని విచారణలో వెల్లడైనట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. కేసులో కీలకంగా పనిచేసిన పోలీసులు అంజాద్, శివకుమార్, మున్నయ్యను అభినందిస్తూ డీఎస్పీ రివార్డులు అందజేశారు.

క్రైం కార్నర్

స్కూటీని ఢీకొన్న లారీ

- రిటైర్డ్ వీఆర్వో దుర్మరణం



జనార్దన్ రావు (ఫైల్)

కామారెడ్డి క్రైం: అదుపుతప్పిన లారీ స్కూటీని ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా శనివారం ఉదయం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన రిటైర్డ్ వీఆర్వో జనార్దన్ రావు వ్యక్తిగత పనుల మీద స్కూటీపై వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ అదుపుతప్పి స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో జనార్దన్ రావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు ఆయనను జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. ఇసాయిపేటకు చెందిన ఆయన కొంతకాలంగా కుటుంబంతో కలిసి కామారెడ్డిలోని ఎన్జీవోస్ కాలనీలో స్థిరపడ్డారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

చేపలవేటకు వెళ్లి విద్యుత్ షాక్‌తో ఒకరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానీపేట గ్రామానికి చెందిన బ్యాగరి రాజయ్య(52) చేపలవేటకు వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. గ్రామశివారులోని పెద్దవాగు మడుగులో శనివారం విద్యుత్ తీగల సహాయంతో చేపలను పట్టేందుకు స్టార్టర్ బాక్సులోని ఫ్యూజ్‌కు వైరు పెట్టి నీటిలో దిగుతున్న క్రమంలో షాక్ తగిలి రాజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించి మృతుడి సోదరి లక్ష్మికి సమాచారం ఇచ్చారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



స్వామి(ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజివాడి గ్రామ శివారులోని స్ప్రింగ్ ఫీల్డ్స్ స్కూల్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారి మండల కేంద్రానికి చెందిన కామెల్లి అరవింద్ స్వామి(29) సదాశివనగర్ మండల కేంద్రంలోని అత్తగారి ఇంటికి వచ్చి భార్యాపిల్లలను చూసి తిరిగి ద్విచక్ర వాహనంపై గాంధారికి వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేసి వెళ్తూ ఎదురుగా వస్తున్న హైచర్ వ్యాన్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన స్వామిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

చికిత్స పొందుతూ మాజీ ఎంపీటీసీ..



జంగిడి లక్ష్మి(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి మాజీ ఎంపీటీసీ జంగిడి లక్ష్మి(61) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. 15 రోజుల క్రితం లక్ష్మి పురుగుల మందు సేవించింది. విషయం తెలిసిన ఆమె చెల్లెలు వెంటనే అక్కను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మి శనివారం మృతి చెందారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలైన జంగిడి లక్ష్మి మృతి పార్టీకి తీరని లోటని మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

చిన్న నిర్లక్ష్యం.. భారీ మూల్యం

- ధాన్యం నూర్పిళ్లు, ఆరబోతలతో రోడ్డు ప్రమాదాలు
- గత అక్టోబర్‌లో జరిగిన ప్రమాదాల్లో 27 మంది మృతి
- అందులో ధాన్యం ఆరబోతలతో జరిగినవే ఎక్కువ
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కనిపించని మార్పు



కామారెడ్డి క్రైం: ఒక్కోసారి చిన్నపాటి నిర్లక్ష్యానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రోడ్లపై ధాన్యం ఆరబోతలు, నూర్పిళ్ల విషయం కూడా అలాంటిదే. ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు సంబంధించిన విషయం కావడంతో అందరూ సర్దుకుపోతుంటారు. కాకపోతే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసుశాఖ గుర్తు చేస్తోంది. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచిస్తున్నారు. గతేడాది జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే పోలీసులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా మార్పు కనిపించడం లేదు. తాజాగా తాడ్వాయి మండలం చందాపూర్‌లో ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తూ రోడ్డుపై ఆరబోసిన మక్కల కారణంగా అదుపుతప్పి కిందపడి మృత్యువాత పడ్డాడు.

పోలీసుల ప్రత్యేక దృష్టి..

కామారెడ్డి జిల్లాలో ప్రతి సంవత్సరం అక్టోబర్ నాటికి వరి, మొక్కజొన్న, సోయాబీన్, పప్పు దినుసుల కోతలు పూర్తవుతాయి. చాలామంది వాటిని రహదారుల వెంట ఆరబోయడం, నూర్పిళ్లు చేస్తుంటారు. ఈ క్రమంలో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. కొంతకాలం క్రితం టేక్రియాల్ వద్ద ఓ రైతు వడ్లను రోడ్డు వెంట ఆరబోసి రాత్రిపూట రోడ్డు దాటే క్రమంలో వాహనం ఢీకొని మృతి చెందాడు. వాహనాలు అదుపుతప్పి పడిపోవడంతో సంభవించిన మరణాలు అనేకం. గత అక్టోబర్ నెలలో జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 27 మంది మృతి మృతి చెందగా, అందులో ధాన్యం ఆరబోతల కారణంగా దాదాపు 10 ప్రమాదాలు జరిగినట్లు భావిస్తున్నారు. దీంతో పోలీసులు ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

అందరి బాధ్యత..

రోడ్లపై ధాన్యం నూర్పిళ్లు, ఆరబోసే విషయంలో వాహనదారులే కాకుండా రైతులు సైతం ప్రమాదాల బారినపడిన ఘటనలు ఉన్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా జరిగే ప్రమాదాల్లో కుటుంబ పెద్ద దిక్కయిన వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంటుంది. అందుకే ధాన్యాన్ని రోడ్లపై కాకుండా గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో మాత్రమే ఆరబోయాలని రైతులకు పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రాణం తీసిన మక్కలు

- కుప్పను తప్పించబోయి బైక్ అదుపుతప్పి ఒకరు మృతి



గంగారెడ్డి (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన పైడి చిన్నగంగారెడ్డి(52) బైక్‌పై తాడ్వాయిలోని చిన్న కూతురు వద్దకు వెళుతున్నాడు. మార్గమధ్యంలో రోడ్డపై ఉన్న మక్కల కుప్పను తప్పించబోయి అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడడంతో గంగారెడ్డి తల, ముక్కుకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గంగారెడ్డి పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగారెడ్డి మరణించాడు. మృతుడికి భార్య మల్లవ్వ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అవగాహన కల్పిస్తున్నాం



రోడ్లపై ధాన్యం నూర్పిళ్లు, ఆరబోయడంతో ఏటా పలు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత. జీపీలు, రైతు సమితులు కేటాయించిన స్థలాల్లోనే పంట దిగుబడులను ఆరబోయాలి. విలువైన ప్రాణాలు రక్షించుకోవాలి.

– రాజేశ్‌చంద్ర, ఎస్పీ, కామారెడ్డి